www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 23 ఏప్రిల్ 2025

5

చిత్తూరు



పాత్రికేయ వృత్తి మహోన్నతం..!

ఫెడరేషన్ చిత్తూరు జిల్లా మహాసభలో ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



మంత్రి రాంప్రసాద్, ఎంఎల్ఏలు గురజాల, పి.మురళి, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

'ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభం మీడియా అని, మీడియా వృత్తి మహోన్నతమైనదని, సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే మార్గదర్శకులుగా పాత్రికేయులు బాధ్యతతో పనిచేయాలి' అని ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిత్తూరు శాసనసభ్యులు తన సొంత నిధులతో 400 మంది పాత్రికేయులకు హెల్త్ ఇన్స్యూరెన్స్ సంబంధించిన మొత్తం 5 లక్షల 20వేలకు సంబంధించిన మెగా చెక్కును పాత్రికేయులకు సభాముఖంగా అందించారు. ఈ ఏడాది మెరిట్ సాధించిన జర్నలిస్టుల పిల్లలకు రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని తాను అందిస్తానని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ చిత్తూరు జిల్లా నాలుగో మహాసభ చిత్తూరు జడ్‌పి కార్యాలయంలో మంగళవారం జరిగింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎంఎల్‌ఎలు గురజాల జగన్మోహన్, పి.మురళీమోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పోటుగాని భాస్కర్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు



ఎస్.వెంకట్రావు, జనరల్ సెక్రటరీ ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వలిగళం గోపి, రాష్ట్ర నాయకులు జయరాజ్, జిల్లా అధ్యక్షులు బి.ప్రకాష్, ప్రధాన కార్యదర్శి సలీంబాష, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షులు జయచంద్ర, ప్రధాన కార్యదర్శి నీరజాక్షులు, నాయకులు దేవరాజులు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 500 మంది పాత్రికేయులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మీడియా వృత్తి చాలా మహోన్నతమైనదని, కార్గిల్ లాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, వాస్తవాలను వెలుగులోకి తెచ్చారన్నారు. సమాజాన్ని ముందుకు నడిపించడంలో మార్గదర్శకులుగా ఉండాలన్నారు. వార్తలను ప్రచురించే ముందు క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తెచ్చేలా వార్తా ప్రసారాలు ఉంటే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాత్రికేయులకు గృహ నిర్మాణం, హెల్త్ కార్డులను సమకూరుస్తుందని, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను పాత్రికేయులకు అందించడంలో ముందుంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయులు ఒత్తిడి లేకుండా పూర్తి స్వేచ్ఛతో పని చేయాలన్నారు. చిత్తూరు, పూతలపట్టు ఎంఎల్‌ఎలు మాట్లాడుతూ పాత్రికేయ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు రానున్న రెండు దశాబ్దాల కాలం వరకూ పాత్రికేయులకు రక్షణ కవచంగా పనిచేస్తుందన్నారు. అనంతరం అతిథులలకు మెమెంటోలను అందజేశారు.



వక్ఫ్ సవరణ చట్టంపై కన్నెర్ర

భారీ ఎత్తున నిరసన ర్యాలీ
సరవణ చట్టానికి అనుకూలంగా సిఎం సంతకం చేయడం బాధాకరం
ప్రభుత్వంపై విరుచుకుపడిన మత పెద్దలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

ముస్లింలకు నష్టం కలిగించే వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని నగరి ముస్లిం సోదరులు, ప్రజా సంఘాలు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కాయి. భారత రాజ్యాంగం ఇచ్చిన మౌలిక హక్కులకు విరుద్ధంగా ఉన్న వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలంటూ బైపాస్ కూడలి నుంచి బస్టాండు వరకు నగరి ముస్లిం సోదరులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాలు వీరికి మద్దతు తెలిపాయి. అనంతరం బస్టాండు ప్రాంగణంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలను ఇబ్బంది పెడుతోందన్నారు. ముస్లింలకు న్యాయం చేస్తారనుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వక్ఫ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లింల మనోభావాలను దెబ్బతీశారన్నారు. ముస్లింలను అణచివేయడానికి బీజేపీ ప్రభుత్వం వక్ఫ చట్టానికి సవరణ చేసిందని అలాంటి చట్టం మాకొద్దంటూ సభలో నినదించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ సవరణ చట్టాన్ని అసలైన ముస్లింలు ఒప్పుకోరన్నారు. ఇతర మతస్తులను వక్ఫ బోర్డులో నియమించడం సమంజసం కాదన్నారు. నగరి, పరిసర ప్రాంతాల్లోని మసీదులు, మదర్సాలకు చెందిన ముత్తవల్లిలు, మతపెద్దలు, ముస్లీం సోదరులతో పాటు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి పెరుమాళ్, దళిత్ పీపుల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు గజేంద్ర, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ముస్లీంలు

'అమరా'లో 'కాంబాట్ సెప్సిస్' కాన్ఫరెన్స్


ప్రజాశక్తి - రేణిగుంట



అమరా ఆస్పత్రిలో 'కాంబాట్ సెప్సిస్' కాన్ఫరెన్స్ విజయవంతంగా మంగళవారం నిర్వహించారు. సెప్సిస్ నిర్వహణలో వైద్యపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడం, యాంటీబయాటిక్స్ హేతుబద్ధమైన ఉపయోగం కోసం ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకున్నామని ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని ప్రసాద్, రమాదేవి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశిష్ట అతిథి డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ అలోక ఎస్, డాక్టర్ జె. రాధ, డాక్టర్ మధన్ మోహన్ రెడ్డి, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ జె ప్రవీణ్, ఇన్‌ఫెక్షన్ డిసీజ్ స్పెషలిస్ట్ డాక్టర్ డి. శ్రీనివాస్‌కర్, డాక్టర్ డి. విజయ్ కుమార్, డాక్టర్ మోనాలిసా సాహు, డాక్టర్ రమాదేవి గౌరినేని ఉత్సవ దీపాలను వెలిగించారు. ఈ కాన్ఫరెన్స్ ఆరోగ్య సంరక్షణలో నిరంతర విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రుల తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మంగళవారం మండలంలోని ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. నాణ్యమైన విద్య బోధనలు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాం ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. గ్రామంలోనే స్థానికంగా చదవడం వల్ల ఉపాధ్యాయులు కూడా అందుబాటులో ఉండి విద్యార్థులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు.



కార్వేటినగరం : కార్వేటినగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలను పనిచేస్తున్న ఉపాధ్యాయులు భారతి, బంగారమ్మ, వేణుగోపాల్, సరిత, గీత మంగళవారం పెద్ద దళితవాడ గ్రామానికి ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలో ఎన్నో ఉపయోగాలు, డీఎస్సీని ఎంపికైన ఉపాధ్యాయులు పాటలు బోధించడం, యూనిఫాం, పుస్తకాలు,మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉందని, మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

నేడు టెన్త్ పరీక్షా ఫలితాలు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: పదవ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల కానున్నాయి. ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ పదో తరగతితోపాటు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు ఒకేసారి విడుదల చేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు తెలిపారు. అభ్యర్థులు ఫలితాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లోనూ, 'మన మిత్ర' వాట్సాప్, లీప్ మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పరీక్షలు నిర్వహించామని, ఫలితాలు కూడా ఆశాజనకంగానే ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు.

రేపటి నుంచే 'వేసవి' సెలవులు

జూన్ 12న మళ్లీ ప్రారంభం

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: ఇన్నాళ్లు వార్షిక పరీక్షలతో హడలెత్తిపోయిన విద్యార్థులకు రేపటి నుంచి ఊరట లభించనుంది. ఎప్పుడెప్పుడా అని పిల్లలు ఎదురుచూసే వేసవి సెలవులు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొత్తం 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉంటాయనీ అధికారిక ప్రకటనా వెలువడింది. ఈ నేపథ్యంలో బుధవారంతో ఈ విద్యా సంవత్సర చివరి పని దినం ముగియనుంది. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు అన్ని పాఠశాలలకూ సెలవులు ప్రకటించారు. జూన్ 12న తిరిగి ప్రారంభం కానున్నాయి.

'యూపీఎస్సీ' ఫలితాల్లో మెరిసిన శ్రీకాంత్



ప్రజాశక్తి - క్యాంపస్: యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఆలిండియా ర్యాంక్ 904 చిత్తూరు జిల్లా పలమనేరు వాసి శ్రీరంపం శ్రీకాంత్ సాధించారు. రంపం శ్రీకాంత్‌పాఠశాల విద్యాభ్యాసం పలమనేరులోనూ, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ హైదరాబాద్‌లోనూ, ఎంబిఎ, ఐఐఎం బెంగుళూరులోనూ చేశారు. ప్రముఖ సంస్థలైన గూగుల్, అమెజాన్లో డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్గా పనిచేస్తు, క్రమశిక్షణ పట్టుదలతో శిక్షణ లేకుండానే – స్వంత ప్రణాళికలతో నిర్విరామంగా కషి చేసి 2025 యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో ఉన్నతమైన ర్యాంకు సాధించినందుకు గాను తల్లి తండ్రులు రేణుక, నాగరాజు(రిటైర్డ్ టీచర్), అత్తమామలు జ్యోత్స్న, చంద్రబాబులకు, తన వెన్నంటి నిలిచిన సతీమణి శ్రావ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమిష్టిగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంలో భాగంగా ప్రధానంగా ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు రెవెన్యూ శాఖలతో పాటు అత్యవసర వైద్యసేవలను అందించేందుకు అవసరమైన పూర్తి సమాచారంను డిసిహెచ్ఎస్, డిఎం అండ్ హెచ్ఓ కలిసి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్స్ ఉన్న ప్రదేశాలకు దగ్గరలో అత్యవసర వైద్య సేవలు పొందడంలో భాగంగా సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న డాక్టర్ల వివరాలు, వారి ఫోన్ నెంబర్లు, అందుబాటులో ఉన్న బ్లడ్ గ్రూప్స్ వివరాలు, అంబులెన్స్ వివరాలు ఇలా వైద్యసేవలు అత్యవసరంగా అందించేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని ప్రతి వారానికి ఒకసారి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ వివరాలు పోలీసు, రెవెన్యూ అధికారుల వద్ద ఉన్నట్లయితే అనుకోకుండా ఎటువంటి ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని ఈ దిశగా పని చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్స్ ఉన్న ప్రదేశాలలో సత్వరమే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునేలా జాతీయ రహదారుల అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో సమస్యాత్మక జంక్షన్స్, స్కూల్ జోన్లు, కాలేజీలు, హాస్పిటల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లైటింగ్, రంబుల్ స్టిక్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో 25 బ్లాక్ స్పాట్స్ జాతీయ రహదారుల్లో ఉన్నాయని ఇక్కడ ప్రమాదాలు నివారణపై నేషనల్ హైవే చేపట్టవలసిన చర్యలపై ఇది వరకే తగు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అందుకు సంబంధించిన పనుల పురోగతిని సమీక్షించారు. జిల్లాలో 2025 జనవరి నుండి మార్చి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించి 179 కేసులు నమోదు కాగా అందులో 86 మంది మరణించినట్లు తెలిపారు. జిల్లాలో గల జాతీయ రహదారులైన 42, 69, 40, 140, 716, 71, 75, 716(ఎ) ల ద్వారా 349. 3 కిలోమీటర్లు, జాతీయ రహదారులతో పాటు 347.9 కిలోమీటర్లు రాష్ట్ర రహదారులు ఉన్నాయని, జాతీయ రహదారులలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల అధికారులు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్టిక్, సోలార్ లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించారు. జిల్లాలో నుండి తిరుపతికి వెళ్లే వాహనదారులకు ముందస్తుగానే సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, జాతీయ రహదారుల వెంట క్రాసింగ్ రోడ్స్‌కు ముందుగానే తిరుపతికి వెళ్లే మార్గాలను సూచించడం ద్వారా వాహనదారులకు సౌకర్యవంతంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారుల వెంట రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు మరో రెండు రోజుల్లో వేసవి సెలవులు రానున్నాయని, ద్విచక్ర వాహనాలలో స్నేహితులతో కలసి ప్రయాణించడం, అతివేగం ప్రమాదకరం అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి వారికి తగు జాగ్రత్తలను తెలపడంతో పాటు వారిని గమనిస్తుండాలన్నారు. సమావేశంలో ఆర్‌టీఓ నిరంజన్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిపిఓ సుధాకర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

మద్యం షాపు మాకొద్దు..

ఊరికి దూరంగా మార్చాలంటూ మహిళల ఆందోళన
పాఠశాలకు వెళ్లే మార్గంలో, జనావాసాలకు మధ్య మందుషాపు



ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని మహారాజపురంలో మద్యం షాపు వద్దు అంటూ మంగళవారం మద్యం షాపు ఎదుట మహారాజపురం వాసులు ధర్నా నిర్వహించారు. మద్యం షాపులతో పాటు భారీ ఎత్తున బార్లను తలపించే విధంగా డాబాలు ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చే స్తున్నారు. మద్యంను అనధికారికంగా రాత్రి, పగలు తేడా లేకుండా విక్రయించడంతో దారిలో పయణించాలంటే అవస్థలు తప్పడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో మందు బాబులు మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని, తరచూ గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. మద్యం బాటిల్పై రూ.10 ఎక్కువగా అమ్ముతున్నారని, దీనివలన తరచూ గొడవలు వస్తున్నాయని, అడిగిన వారిపై చేయి చేసుకోవడంతో పోలీసు స్టేషన్ వరకు పంచాయతీ వెళ్లిందని, గ్రామంలో ప్రశాంతంగా ఉండలేక పోతున్నామని వాపోయారు. మద్యం షాపును ఊరికి దూరంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి, విజయపురం ఎస్ఐ రంగా సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు.

పోటో: మహారాజపురంలో మద్యం షాపు ఎదురుగా ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఉపాధి కల్పించడమే ధ్యేయం

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



చెన్నై అంబత్తూరులో పారిశ్రమిక వేత్తలతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి- విజయపురం: నగరి నియోజకవర్గం విజయపురం మండలం కోసలనగరంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్టు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ఆయన మంగళవారం ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ, సెర్ప్, ఎన్ఆర్ఎ సాధికారత, సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి చెన్నై అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుప్యాక్చర్ అసోషియేషన్ ప్రతి నిధులతో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసలనగరంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి పరిశ్రమల స్థాపనకు ఏపీఐఐసీ సేకరించిన భూముల వివరాలను, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వారికి వివరించారు. పరిశ్రమ ప్రతినిధులు కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పరిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

నగరవనంలో అటవీ శాఖ క్యాంటీన్ నిర్మాణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరవనంలో శ్రీనివాస మంగాపురం ఏకో డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సిబ్బంది కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ క్యాంటీన్ ఏర్పాటు కోసం అటవీశాఖ అధికారులు చెట్లను తొలగించారు. చెట్లు తొలగించడంపై ప్రకతి ప్రేమికులతో పాటు రాజకీయ నాయకులు పెదవి విరుస్తున్నారు. సంరక్షించాల్సిన అధికారులే పచ్చని చెట్లను నేలకూల్చడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. దాదాపు 15 నుంచి 20 ఏళ్ల వయసు కలిగిన చెట్లను నరికి వేయడం పట్ల వైసిపి తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగరవనానికి చేరుకుని అటవీశాఖ అధికారుల తీరును తప్పుపట్టారు. ఎన్నో జీవజాలాలకు నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే నగరవనంలో చేపట్టిన ఈ ప్రాజెక్టును వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో ప్రకతి ప్రేమికులతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల పరిస్థితి పట్టించుకోండి..



నిరసన తెలుపుతున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల పరిస్థితి ప్రభుత్వం పట్టించుకోవాలంటూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేచురల్ పార్మింగ్ వర్కర్స్ యూనియన్ వారు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం కుప్పం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఫ్లెక్సీలు చేతబట్టి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న సిబ్బందికి గత 12 నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణకు, పిల్లల చదువులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 2023 నుండి బకాయి ఉన్న వేతనాలను చెల్లించడంతోపాటు భవిష్యత్తులో ప్రతినెలా సక్రమంగా వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలని, ఐసిఆర్‌పిలకు, ఎల్ టులకు వేతనాలు అందించాలని, ప్రభుత్వ నియమాలను అనుసరించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామాలలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ కేంద్రాలలో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది అనారోగ్యపాలయ్యే, ప్రమాదాల భారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. నిరసన అనంతరం తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ కడా పీడీ వికాస్ మరమ్మాత్‌కు వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

'డిక్సన్' కంపెనీ బస్సు బోల్తా

ప్రజాశక్తి - రేణిగుంట

తెలతెలవారక ముందే ఇంట్లో పనులన్నీ ముగించుకుని షిఫ్ట్ డ్యూటీకి కంపెనీ బస్సులో బయల్దేరిన ఉద్యోగులు రోడ్డు ప్రమాదంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక్క నిమిషం ఏం జరిగిందో తెలియక బిత్తరపోయారు. నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారిలోని రేణిగుంట మండలం మర్రిగుంట సర్కిల్ వద్ద ట్రాక్టర్‌ను తప్పించబోయి డిక్సన్ కంపెనీ బస్సు ఉదయం 7.55 గంటలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఉదయం షిఫ్ట్‌కు బయల్దేరి వెళు తున్న 46 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని బాలాజీ, అమర ఆస్పత్రులకు రేణిగుంట అర్బన్ పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన వివరాలిలా ఉన్నాయి.

ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు

'ఫాక్స్ లింక్ కంపెనీ' (డిక్సన్) బస్సు యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలైన మహిళా కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు మండల కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్ డిమాండ్ చేశారు. ఘటనా స్థలాన్ని మండల అధ్యక్షులు సెల్వరాజ్, ఏర్పేడు మండల కార్యదర్శి కరీముల్లాతో కలిసి పరిశీలించారు. గాయపడిన మహిళా ఉద్యోగులను పరామర్శించారు. కంపెనీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా తీవ్రంగా గాయపడిన వారిని 108 ద్వారా కరకంబాడి రోడ్డులోని అమరా ఆస్పత్రికి తరలించారని తెలిపారు. 46 మందిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. నలుగురు తీవ్రంగా గాయపడి ఆపరేషన్ థియేటర్‌లో చికిత్స పొందుతున్నారని అమరా ఆస్పత్రి వైద్యులు తెలిపారన్నారు.



'అమరా'లో సకాలంలో వైద్యసేవలు

అమరా ట్రామా సిస్టమ్ బృందం అంబులెన్స్ ద్వారా సైట్ నుంచి తక్షణ సంరక్షణ అవసరమయ్యే బాధితులకు వేగవంతమైన చికిత్స, సురక్షిత రవాణాలో కీలక పాత్ర పోషించింది. 5-10 మంది తీవ్రంగా గాయపడ్డారని, 35 మంది స్థిరంగా అబ్బర్వేషన్‌లో ఉన్నారని, నలుగురు ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నారని ఆస్పత్రి ఛైర్మన్ గౌరినేని ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి పేర్కొన్నారు. అమర ఆస్పత్రి, అమరరాజా సంస్థ, ఫాక్స్‌లింక్, సన్నీ ఒపోటెక్ నుంచి దాదాపు 30 మంది వాలంటీర్లు రక్తదానం చేశారన్నారు.

డిజిటల్ అసిస్టెంటు ఎక్కడ?

● నెలకు పైగా కనిపించని వైనం ● అందని సర్టిఫికెట్లు ● విద్యార్థులు అయోమయం ● స్పందించని అధికారులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ లోని సచివాలయంలో నెల రోజులకు పైగా డిజిటల్ అసిస్టెంట్ కనిపించడంలేదు. దీంతో విద్యార్థులు వివిధ రకాల సర్టిఫికెట్లు అందక అయోమయంలో పడ్డారు. రైతులు సైతం పట్టాదారు పుస్త కాల కోసం వెళితే డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో తీవ్ర నిరాశకు గుర్తై వెనుతిరిగి రావాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాల్సి వుంది.

అందని సర్టిఫికెట్లు

మండలంలో విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు, ఆదాయ సర్టిఫికెట్లు , రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ముటేషన్ అప్లై చేసుకునేందుకు ఆ సచివాలయానికి వెళితే అక్కడ డిజిటల్ అసిస్టెంట్ ఉండడు.. ఇక్కడ లేదు కదా? అని పక్క సచివాలయానికి వెళితే 'మీ పంచాయతీలోని సచివాలయం లోనే అప్లై చేసుకోవాలి.. ఇక్కడ కుదరదు..!' అని అక్కడ అధికారులు చెబుతున్నారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆ సచివాలయానికి తిరుగుతూ ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో అయోమయంలో పడ్డారు. సకాలంలో ఈ ధ్రువీకరణ పత్రాలు అందక విద్యార్థులు



నష్టపోతున్నారు. తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురి అవుతున్నారు.

స్పందించని అధికారులు

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో, వెదురు కుప్పం మండలం మాంబేడు పంచాయతీలో సచివాలయంలో సేవలు అందిస్తున్న అఖిల్ నెలక్రితం సెలవులపై వెళ్లాడు. ఇతని స్థానంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అధికారికంగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన వివిధ సర్టిఫికెట్లను ఎలా అప్‌లోడ్ చేయాలో తెలియక 'నాకు తెలియదు..' అంటూ సమాధానం ఇస్తున్నాడని విద్యార్థులు పేర్కొంటున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పక్కనే ఉన్న పచ్చికాపల్లం సచివాలయానికి పరుగులు పెడుతున్నారు. ఆ సచివాలయంలో ఉన్న సిబ్బంది 'మీరు మీ సచివాలయంలోనే అప్లై చేసుకోవాలి ..ఇక్కడ కుదరదు..!' అని చెప్పడంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో అయోమయంలో పడ్డారు. పై స్థాయి చదువులకు కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ పత్రాలు అవసరం ఇవి అందక విద్యార్థులు నష్టపోతున్నారు. ఒకసారి ఈ పత్రాలు లేకపోతే కాలేజీ, స్కూల్ వారు అప్లికేషన్‌ను తిరస్క రిస్తారు. అందుకోసం ముందస్తుగా ప్రయత్నాలు చేస్తు న్నారు. వారి ప్రయత్నాలు ఫలించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సచివాలయానికి డిజిటల్ అసిస్టెంటును నియమించాలని కోరుతున్నారు.

ఇబ్బంది లేకుండా మరొకరిని నియమిస్తాం



ఈ సచివాలయం మండలం లోని పెద్ద సచివాలయా ల్లో ఒకటి. ఇక్కడ డిజిటల్ అసిస్టెంటు లేక సమస్య వుంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఒకటి, రెండు రోజుల్లో వేరే వ్యక్తిని అసిస్టెంటుగా నియమిస్తాం...

-పురుషోత్తం,ఎంపీడీవో, వెదురుకుప్పం.

నేడు సోమల మండల సమావేశం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు , మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, వీఆర్వోలు ఇతర శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని వారి వారి శాఖల ప్రగతి నివేదికలకు సంబంధించి పది సెట్ల జిరాక్స్ కాపీలను ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని తెలిపారు. ప్రతి శాఖకు సంబంధించి బాధ్యులైన అధికారులు మాత్రమే సమావేశానికి హాజరుకావాలని కింది స్థాయి ఉద్యోగులను సమావేశానికి పంపించకూడదని తెలిపారు.



భూముల రీ సర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రీ సర్వేతో శాశ్వత పరిష్కారం: తహశీల్దారు

ప్రజాశక్తి- పూతలపట్టు: భూ రీ సర్వేతో రైతుల దీర్ఘకాలిక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహశీల్దారు రమేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని పేట అగ్రహారంలో భూ రీ సర్వేను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపి మునికృష్ణ, టిడిపి మండల కన్వీనర్ దొరబాబు, సర్వేయర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులకు అవగాహన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వ్యవసాయ పనులపై అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని ఆళ్ల మడుగు రైతు సేవా కేంద్రం పరిధిలోని బుచ్చిరెడ్డి కండ్రిగ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి చిత్తూరు జిల్లా డిఆర్‌సికి చెందిన వ్యవసాయాధికారిణి లక్ష్మీ ప్రసన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగా చేసుకోవాల్సిన వ్యవసాయ పనులను వేసవి దుక్కులు చేసుకోవడం, ప్రధాన పొలం తయారు చేసుకోవడం, మేలైనవిత్తన రకాల ఎంపిక, విత్తన శుద్ధి, వేసవిలో మినుము, పెసర వంటి పప్పు దినుసుల సాగు, ఈ పంట నమోదు కార్యక్రమం, కౌలు రైతు సర్టిఫికెట్లకు సంప్రదించడం రైతుల రిజిస్ట్రీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం వంటి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రైతుల పొలాలను సందర్శించి మట్టి నమూనాలను సేకరించే పద్ధతి గురించి రైతులకు పొలంలో చూపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వనిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి స్వయంబేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలోని శ్రీ స్వయంబేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుండి ప్రారంభం కానున్నాయి. 23వ తేదీ బుధవారం కలశ స్థాపన, ధ్వజారోహణం, 24,25,26,28,30 తేదీలలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉభయాలు, రాత్రి పుష్ప పల్లకిలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 27వ తేదీ ఆదివారం కళ్యాణ మహోత్సవం, నిర్వహించనున్నారు. 29వ తేదీ మంగళవారం రథోత్సవం, ఒకటవ తేదీ ఉదయం వసంతోత్సవం సాయంత్రం ధ్వజా అవరోహణం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త, నిర్వాహకులు తెలిపారు.

మాజీ ఎంపీపీ రాజారెడ్డి మృతి

పలువురి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం ఎట్టేరి గ్రామంలోని మాజీ ఎంపీపీ కేజీ రాజారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి మంగళవారం సత్యవేడు నియోజక వర్గం వైసీపీ ఇన్‌ఛార్జి రాజేష్, కుతూహలమ్మకుమారుడు హరికృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేల్కూరు బాబు రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుణశేఖర్ మొదలి, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉపాధ్యాయురాలు ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


నైతిక విలువలు నేర్పారు..

ప్రజాశక్తి-పెద్దపంజాణి:

మండలంలోని అప్పినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలుగా భాను విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించారని ప్రధానోపాధ్యాయులు నందకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమెను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నందకుమార్ మాట్లాడుతూ తక్కువ సమయంలో డిప్యుటేషన్ పై సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయురాలు గా పనిచేసి, ఉత్తమ బోధనలతో విద్యార్థులను, ఉన్నత స్థాయికి తీసుకొచ్చారని, వారి సేవలను ప్రశంసించారు. జీవశాస్త్రం ఉపాధ్యాయుడు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు ప్రసరింపచేసి,నేడు రిలీవ్ కావడం బాధాకరమని, వీరు ఏ పాఠశాలలతో పనిచేసిన ఆపాఠశాలలోని విద్యార్థులకు ఉత్తమ విలువలతో కూడిన బోధన అందించాలని కోరారు. విద్యార్థులు తమ కోరికలను అదుపులో వుంచుకేని, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల గోపి, ఉదయ్ కుమార్,లక్ష్మీ ప్రసన్న, శ్రీదేవి, భారతి, శంకర్ హరికృష్ణ, సోమశేఖర్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలం తొడతర గ్రామంలో చిరుధాన్యాల సాగుపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఏరువాక సమన్వయకర్త డాక్టర్ సంధ్యారాణి, ఏవో ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమైన పంట రాగిలోని రకాలు అధిక దిగుబడి, సస్యరక్షణ చర్యలు, విత్తన శుద్ధిపై రైతులకు వివరించారు. చిరుధాన్యాలలో ఐరన్, జింక్ విటమిన్లు ఉండటం వల్ల పోషకాహారం, మంచి శక్తిని, స్థాయిని ఇస్తుందని తెలిపారు. జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసాయన ఎరువులు వాడటం తగ్గించి సమగ్ర ఎరువులు, యాజమాన్య పద్ధతులు వాడడం వల్ల భూసార పరీక్షా ఫలితాలు ఆధారంగా పంటలు అధిక దిగుబడి తీసుకొస్తాయని తెలిపారు. రైతులకు అధిక దిగుబడి నిచ్చే రాగి రకం విత్తనాలు, కలుపు మందులు, వేపగింజల కషాయం రైతులకు పంపిణీ చేశారు.



బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న జిజేఎం ట్రస్ట్ ఫౌండేషన్ అధినేత

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -గుడిపాల:

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన గుడిపాల మండలం రామభద్రాపురం పంచాయతీ చెందిన చాణక్యవర్మ కుటుంబ సభ్యులకు జిజేఎం ట్రస్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవ నాయుడు మంగళవారం ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. అనంతరం ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపక బృందం

ఉద్యోగాలకు కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -కుప్పం రూరల్ :

బిసిఎన్ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రైవేటు ఉద్యోగులుగా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని కళాశాల ఛైర్ పర్సన్ శాంతా నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కళాశాల ఆవరణలో బెంగళూరు నగరానికి చెందిన ఆల్ డి జి టెక్ సంస్థ వారు కుప్పం డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రాంగణ నియామకాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ ఎంపికలో కళాశాలలోని బికాం, బీబీఏ, బీఎస్సీ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. మూడు విడతలుగా నిర్వహించిన ఎంపికలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన తొమ్మిది మంది విద్యార్థులను ఉద్యోగులుగా ఎంపిక అయినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపక బృందం నూతన ఉద్యోగులను అభినం దించారు



సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ప్రధానోపాధ్యాయులు

సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి- విజయపురం:

మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానికిరామారెడ్డి ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. బ్యాంకిక్, ఐటీలో 15 రోజుల పాటు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు, జీవనోపాధి వంటి వాటిపై శిక్షణ అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రాజ్కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి -గుడిపాల: భూ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే సాధ్యమవుతుందని సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ లోకేష్ అన్నారు. గుడిపాల మండల కేంద్రంలోని స్థానిక సిఎన్ఆర్ కళాశాలలో ధరిత్రిదినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ లోకేష్ మాట్లాడుతూ భూమిని కలుషితం చేయకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. 'భూమిని కాపాడు జీవితాన్ని కాపాడు' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. భూమి లేకపోతే జీవితం లేదన్నారు. భూమి మీద చెట్లను పెంచి ఆరోగ్యకరమైన జీవితానికి నాంది పలకాలన్నారు. విద్యార్థి దశలోనే సేవగుణం అలవర్చుకోవాలని, ప్లాస్టిక్కు నివారించి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వాడటం తగ్గించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

ఆరోగ్యకరమైన సమాజాన్ని స్థాపించాలన్నారు. ప్రతిజ్ఞ చేసి ,ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్, ఎన్‌సిసి కేర్ టేకర్ హేమంత్ కుమార్, అధ్యాపకులు రంజిత్ కుమార్, జోయల్ , ఉపాధ్యాయులు కోదండమ్ ,అనురాధ, జయ కుమారి పాల్గొన్నారు.

పదవతరగతి ఫలితాలు..

విద్యార్థులకు తొలి మెట్టు

ప్రజాశక్తి కార్వేటినగరం : రాష్ట్రవ్యాప్తంగా రేపు విడుదల అయ్యే పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని కోరుకుంటున్నామని ఎంపీడీఓ తెలిపారు. ఈ పరీక్షల ఫలితాలు జీవితంలో ఒక మెట్టు నుండి ఇంకో మెట్టుకు అధిరోహించే మార్గమే అన్నారు. కొన్ని సందర్భాల్లో స్వల్ప మార్కులతో ఉత్తీర్ణత కాలేకపోయినప్పటికీ అధైర్య



ఎంపీడీఓ టి చంద్రమౌళి

పడకుండా ముందుకు సాగేలా విద్యార్థులు ఆలోచించాలన్నారు. కొన్ని సబ్జెక్టులో ఉత్తీర్ణత కాకపోయినా నెలలోపులే తిరిగి పరీక్ష రాసుకునే అవకాశం ఉన్న విషయాన్ని విద్యార్థులు మరువకూడదని, ఎలాంటి ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

ప్రజాశక్తి -కుప్పం రూరల్ : ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కరించడానికి రీ సర్వే ఎంతో సహకరిస్తుందని గ్రామ రెవెన్యూ అధికారులు తెలిపారు. మంగళ వారం కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లి రెవెన్యూ గ్రామంలో రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు పై అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భం గా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలు, ముఖ్యంగా రైతులు రెవెన్యూ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

ఈ సమస్యల పరిష్కారానికే ఏరియల్ సర్వే పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించా మని తెలిపారు. రీ సర్వే పనులను త్వరలో చెక్కునత్తం పంచాయ తీలో నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరు తూ స్థానిక టిడిపి నాయకులు, రైతులు, గ్రామస్తులు కలిసి రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి : సిడిపిఓ

ప్రజాశక్తి -కార్వేటినగరం : గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు అధిక శక్తిని ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలని సూపరు వైజర్లు పేర్కొన్నారు. కార్వేటి నగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు కార్వేటి నగరంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరువైజర్లు మాట్లాడుతూ పౌష్టికాహారం కలిగిన పదార్థాల వల్ల ఇచ్చే శక్తిని వివరించారు. పిల్లల్లో ఊబకాయం రాకుండా ముందు నుంచి తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లు వివరించారు. పిల్లలు టెలివిజన్, మొబైల్ ఫోన్లో అలవాటు పడకుండా దూరంగా ఉండేలా, పిల్లలు తోటి పిల్లలతో కలిసిమెలిసి ఆడుకునేలా తల్లి దండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో సూపరువైజర్లు శ్యామిని, ఇందిరా, అగ్రికల్చర్ ఏవో హేమలత, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్వేటినగరంలో

విజయపురం, (నగరి) : పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, పారిశుద్ధ్యం పాటించాలని, ప్లాస్టిక్ కవర్లను వినియోగించ వద్దని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లా డుతూ నగరి ఐసీడీఎస్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు వివిధ కార్యాక్రమాల ద్వారా పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గర్భిణు లు, బాలింతలు, కిషోర బాలికలు, తల్లులు పౌష్టికాహారం తీసుకుంటే వారితో పాటు భవిష్యత్తు తరాలవారు ఆరోగ్యం గా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఎస్ శంకర మ్మ, టి లక్ష్మి, బీపీసీ గోపీనాథ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నగరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, అధికారులు

గృహాలపై ఎంపీడీవో సమీక్ష

ప్రజాశక్తి- శాంతిపురం:

పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో కుమార్ మంగళవారం హౌసింగ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఏవై స్కీం ద్వారా నిర్వహించిన సర్వేలో 2243 మందికి పక్కా గృహాలు అవసరమని ఆయన తెలిపారు. ఇందులో 1998 మందికి సొంత నివేశ స్థలాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరికీ నివేశ ధ్రువపత్రాలు మంజూరు చేయాల్సి వున్న కారణంగా నేటి నుండి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి ధ్రువపత్రాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం రాళ్ళబుదుగురు ఎస్సై నరేష్ మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలు మరియు ప్రభుత్వ స్థలాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయని వాటిని గుర్తించి తగిన సమాచారం అందజేయాలని సంబంధిత



సమీక్షిస్తున్న ఎంపిడివో

అధికారులను కోరారు. అన్ని గ్రామాల్లో ముఖ్యమైన ప్రదేశాల్లో రెండు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సచివాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు సర్వేయర్లు హౌసింగ్ సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా నాగిరెడ్డిపల్లి పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెద్దపంజాణి:

మండలంలోని నాగిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురస్కరించుకుని బాబురెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని జ్ఞాన సముపార్జనే విద్యార్థి లక్ష్యంగా ఉండాలని చదువుతోపాటు సంస్కారం, సంస్కృతి, దేశ సంప్రదాయాలను విద్యార్థులు నేర్చుకుని పాటించాలని, భావితరాలకు అందించే వారధులుగా నిలబడాలన్నారు.ఈ పాఠశాల పురోభివృద్ధికి తాను, తన తోటి ఉపాధ్యాయులు అందరూ అహర్నిశలు శ్రమించి ప్రాథమికోన్నత స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయిగా ఉన్నతి పొందడం గర్వంగా ఉందన్నారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో ఆ పాఠశాలలో 25 సంవత్సరాలుగా పనిచేసి ఉపాధ్యాయులందరిని ఘనంగా సత్కరించారు.అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి,వాణిశ్రీ,మాధవన్, అంజప్ప,గంగాధరం,రాజేష్ బాబు,అజయ్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మేఘన, గ్రామస్థులు,నాయకులైన భూపతి, సుబ్రమణ్యం రెడ్డి, రామచంద్ర, లక్ష్మయ్య, శివన్న, త్యాగరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కష్టపడిన వారికే గుర్తింపు

ఏపీఎస్ఆర్‌టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

ప్రజాశక్తి- రామకుప్పం:

టిడిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్న కార్యకర్తలకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్, మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. రామకుప్పం లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద టీడీపీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశాల మేరకు యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామపంచాయతీల అధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మణింద్రం, రామకుప్పం యూనిట్ ఇన్చార్జిలుగా వెంకటరమణ, సీతాపతి, పంచాయతీ అధ్యక్షులుగా మంజునాథ్, రామకుప్పం పంచాయతీ అధ్యక్షులుగా విజయకుమార్ రెడ్డి, కార్యదర్శులు తదితరులను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని పార్టీకి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, నారాయణ చారి, కృష్ణా నాయక్, రఫీ, నందా రెడ్డి, చలపతి, చిన్నకృష్ణ, విశ్వనాథ్, వెంకటాచలం, సుబ్రి,బాలు,సతీష్ ,అవినాష్, మంజునాథ్, ఆదిల్, సురేష్ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :

చిత్తూరు నగరంలో చేపట్టిన రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులను కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మంగళవారం సాయంత్రం పరిశీలిం చారు. ప్రధానంగా గిరింపేట నుండి కొత్త కలెక్టరేట్ వరకు రహదారి విస్తరణ పనుల్లో భాగంగా దుర్గమ్మ గుడి నుండి కలెక్టరేట్ వరకు వంద అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన చేశారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంపై చర్చించారు. రోడ్డు విస్తరణకు సంబంధించి మాస్టర్ ప్లాన్, వాస్తవంగా అందుబాటులో ఉన్న భూమి తదితర విషయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఏ ప్రాంతంలో ఎంత స్థలం అందుబాటులో వుంది. ఇంకా ఎంత కావాలి? అనే అంశాలపై సమగ్రంగా నివేదిక తయారు చేసి సమర్పించాలన్నారు. నగరంలో సాగుతున్న రహదారి విస్తరణ అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జరిగే చేపట్టిన విస్తరణ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి నరసింహ ప్రసాద్, ఎసీపీ నాగేంద్ర, నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE DISTRICT MUNSIF CUM JUDICIAL MAGISTRATE AT PALLAVARAM
D.V. No.11 of 2024

A R Rahima Yasmin, D/o. Abdul Rawoof, No:4, 2nd Street, 7th Main Road, New Colony, Chrompet. 600044.
... Complainant / Aggrieved Person / wife

Vs.

Sheik Ameer Faizal,
... Respondent / Husband
Maqsood Ali.,
... Respondent / Father in Law
Reshma,
... Respondent / Mother in Law
Affrin, **... Respondent / Sister in Law**
All are residing in
2-475/9, Pillar Kovil Street, Konga reddy palli, Chitoor - 517001, Andra Pradesh(AP).

NOTICE

Take notice that the Complainant filed DVC No. 11 of 2024 before the Hon'ble District Munsif Cum Judicial Magistrate, at Pallavaram, Chengalpattu District, State of Tamil Nadu for protections under the Domestic Violence Act. As the complainant have taken several Court summon as well as Private Notice to the respondents to appear before the Hon'ble Court and the Hon'ble Court has been pleased to order paper publication to you, returnable by 09.05.2025. Kindly be present before the Said Court on 09.05.2025 at 10.30 am in person, failing which the above matter will be heard and decided in your absence.

A R Rahima Yasmin,
Complainant.